సాక్షి ఖమ్మం

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



రూ.128 కోట్ల పనులు..

సత్తుపల్లిలో రూ.128కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. 8లో



ఖమ్మం టౌన్ ఏసీపీ పరిధిలోకి..

రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌ను ఖమ్మం రూరల్ ఏసీపీ పరిధి నుంచి ఖమ్మం టౌన్ ఏసీపీ పరిధిలోకి బదలాయించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం

32° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

కేజీబీవీలో డీఈఓ తనిఖీ

కారేపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయం, కళాశాలను జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, డార్మెటరీల్లో పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే, ఇంటర్ విద్యార్థులకు ఫిజిక్స్ బోధించిన ఆయన వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా స్పెషలాఫీసర్ ఝాన్సీసౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాజరుశాతం పెంచాలి

బోనకల్: విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చేలా పర్యవేక్షిస్తూ పాఠాలు బోధించాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు సూచించారు. బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం తనిఖీ చేసిన ఆయన ప్రిన్సిపాల్ నళినిశ్రీ, అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. కళాశాలలలో సౌకర్యాలపై ఆరా తీసిన ఆయన విద్యార్థులు క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలని, ఉత్తమ ఫలితాల నమోదుకు కృషి చేయాలని తెలిపారు. గత ఏడాది మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు పలువురు ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో సీట్లు సాధించడంపై అభినందించారు.

విచారణ ముద్దాయిల విడుదలకు చర్యలు

ఖమ్మంలీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు విచారణ ముద్దాయిలను బెయిల్‌పై విడుదల చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావీద్ పాషా తెలిపారు. ఇందుకోసం జిల్లా జడ్జి అధ్యక్షతన ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కారాగారంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. అలాగే, బెయిల్ మంజూరై జమానత్ పెట్టుకోలేని వారి కేసులను కూడా కమిటీ పరిశీలిస్తుందన్నారు. జైలు అధికారి సక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతా సిద్ధం...

- నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన
- ఖమ్మం, సత్తుపల్లిలో రూ.1,507 కోట్ల విలువైన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన
- గుబ్బగుర్తిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి భూమి పూజ
- ఖమ్మం, సత్తుపల్లిల్లో ప్రగతి నివేదన సభలు
- పాల్గొననున్న మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శనివారం పర్యటించనుండగా, ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనుండగా, ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేటీఆర్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు దాదాపు 8.15 గంటల పాటు ఖమ్మం, కొణిజర్ల మండలం గుబ్బగుర్తి, సత్తుపల్లి, భద్రాచలంలో జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. కేటీఆర్‌తోపాటు రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మొత్తంగా రూ.1,507.55 కోట్ల విలువైన పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపన చేశాక ఖమ్మం, సత్తుపల్లిల్లో జరిగే ప్రగతి నివేదన సభల్లో మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తారు.

గుబ్బగుర్తిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం సమీపాన గోద్రేజ్ అగ్రోవెట్ కంపెనీ నిర్మించనున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి కేటీఆర్ భూమిపూజ చేస్తారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన 120ఎకరాలకు గాను 113.15ఎకరాలు సేకరించి ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. రూ.250కోట్ల నిధులతో నిర్మించే ఈ ఫ్యాక్టరీని తొలుత 30మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ప్రారంభించి క్రమంగా 60మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి విస్తరిస్తారు.

ఖమ్మంలో ప్రగతి నివేదన సభ

ఖమ్మంలో రూ.1,369.35 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. మున్నేరు పరీవాహక ప్రజల ఇబ్బందులు తొలగేలా రూ.690.52 కోట్లతో ఆర్‌సీసీ వాల్, రూ.180 కోట్లతో తీగల వంతెన, అమృత్–2 ద్వారా కింద రూ.249.50 నిర్మించే అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులు, రూ.100 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు, రూ.10 కోట్లతో లకారం వద్ద చేపట్టే అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, ఎల్ఆర్ఎస్ రెండో విడత నిధులు రూ.20 కోట్లతో నిర్మించే రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, రూ.108.71 కోట్లతో గోళ్లపాడు చానల్‌పై నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, పార్కులు, 20వ డివిజన్‌లో రూ.71 లక్షలతో నిర్మించిన ఫుట్‌బాల్ టర్ఫ్ కోర్టు, లకారం వద్ద రూ.1.37 కోట్లతో నిర్మించిన ఎన్టీఆర్ పార్కు, గట్టయ్య సెంటర్‌లో రూ.8.54 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభిస్తారు. చివరగా ఖమ్మం కార్పొరేషన్ ఎదుట ప్రగతి నివేదన సభలో ఖమ్మం పట్టణ ప్రగతి డాక్యుమెంటరీ వీడియోను ఆవిష్కరించాక కేటీఆర్ ప్రసంగిస్తారు.

సత్తుపల్లిలో రూ.138.2 కోట్ల పనులకు..

సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించనున్న మంత్రులు మున్సిపాలిటీ పరిధిలో రూ.138.2 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఇందులో మినీస్టేడియం, చాకలి ఐలమ్మ దోబీఘాట్, షాదీఖానా, క్రిస్టియన్ భవన్, బీఆర్.అంబేద్కర్ ఆడిటోరియం, రోడ్డు డైవర్షన్ నిర్మాణం, రోడ్డు వెడల్పు పనులు ఉన్నాయి. ఇక్కడ కూడా ప్రగతి నివేదన సభలో మంత్రులు ప్రసంగిస్తారు. ఇక భద్రాచలంలో రూ.38 కోట్లతో చేపట్టనున్న కరకట్ట నిర్మాణానికి కూనవరం రోడ్డులో శంకుస్థాపన చేయడమేకాక పలు పనులకు శంకుస్థాపన చేస్తారు.



మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్న ఖమ్మంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్

చివరి అధికారిక కార్యక్రమమా?

త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందన్న ప్రచారం జరుగుతుండగా,మంత్రి కేటీఆర్ చివరి అధికారిక కార్యక్రమం ఇదేనని తెలుస్తోంది. దీంతోపలు అభివృద్ధి పనులను ప్రారంభించడమేకాక నిర్మాణాలకు శంకుస్థాపన చేయించేలా ఏర్పాట్లు చేశారు. కాగా, హైదరాబాద్ నుంచి ఉదయం 7.45 గంటలకు హెలీకాప్టర్‌లో మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి బయలుదేరనుండగా, ఉమ్మడి జిల్లాలో జరిగే కార్యక్రమాల్లో మంత్రి పువ్వాడ, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులు పాల్గొంటారు. తొలుత కొణిజర్ల మండలం అంజనాపురం సమీపాన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశాక ఖమ్మంలో జరిగే కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొంటారు. అనంతరం హెలీకాప్టర్‌లో భద్రాచలం వెళ్లి అక్కడ పనులకు శంకుస్థాపన చేశాక సత్తుపల్లికి హెలీకాప్టర్‌లో వస్తారు. సత్తుపల్లిలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు పూర్తయ్యాక బహిరంగ సభలో ప్రసంగించనున్న మంత్రి కేటీఆర్... తిరిగి హైదరాబాద్ బయలుదేరతారు.

కేసీఆర్ చొరవతో రూ.వందల కోట్లు

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అండదండలతో ఖమ్మం నియోజకవర్గానికి రూ.వందల కోట్ల నిధులు మంజూరు కాగా.. చేపట్టిన పనులతో నియోజకవర్గ రూపురేఖలే మారాయని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో శనివారం మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యాన కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి మాట్లాడుతూ మునుపెన్నడూ లేనివిధంగా అడగగానే అభివృద్ధి పనులకు వేల కోట్ల నిధులు ఇస్తున్నారని తెలిపారు. కేసీఆర్‌తో పాటు మంత్రి కేటీఆర్ ఖమ్మంలో జరిగిన అభివృద్ధిని అసెంబ్లీలో పొగిడారని, వారి అండతో నేడు ఖమ్మం మెరిసిపోతుందన్నారు. కాగా, శనివారం పర్యటనలో భాగంగా మంత్రి కేటీఆర్ కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనుండగా, ఖమ్మం, సత్తుపల్లిలో పూర్తయిన పనులను ప్రారంభించి పలు నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కాగా, భద్రాచలంలో గోదావరి నదిపై కరకట్ట నిర్మాణానికి రూ.38 కోట్ల నిధులు మంజూరయ్యాయని పువ్వాడ తెలిపారు. ఈ నిర్మాణానికి నిర్మాణానికి కూడా కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఈసమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు కమర్తపు మురళి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, పగడాల శ్రీవిద్య, దాదె అమృతమ్మ, ధనాల రాధ, శీలంశెట్టి రమ, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్

మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

సమీక్షించిన కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

ఖమ్మంసహకారనగర్/ఖమ్మం క్రైం: జిల్లాలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం పర్యటించనున్న నేపథ్యాన పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు అంతా సిద్ధం చేయాలని, అధికారులు కేటాయించిన చోట సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. తొలుత కమిషనరేట్‌లో సీపీ వారియర్ అధికారులతో సమావేశమై బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్‌పై సూచనలు చేశారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్, అదనపు డీసీపీలు ప్రసాద్‌రావు, బోస్, కుమారస్వామి, ఏసీపీలు హరికృష్ణ, గణేష్, ప్రసన్నకుమార్, బస్వారెడ్డి, సారంగపాణి, రెహమాన్, రవి, శివరామయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ

గోదాంలు పరిశీలన

రఘునాథపాలెం: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుకు రఘునాథపాలెంలోని జింకలతండా సమీపాన గోదాంలను కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాప్‌లో వివరాల నమోదుపై శిక్షణ

ఖమ్మంవైద్యవిభాగం: అసంక్రమణ వ్యాధులపై మూడో విడత స్క్రీనింగ్ నేపథ్యాన యాప్‌లో రోగి వివరాలు నమోదు చేయాల్సిన విధానంపై ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది, వైద్యులు, స్టాఫ్‌నర్సులకు శిక్షణ ఇచ్చారు. ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటుచేసిన శిక్షణలో డబ్ల్యూహెచ్‌ఓ అధికారి డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కొత్త యాప్‌లో బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ వివరాల నమోదుపై అవగాహన కల్పించగా, అసంక్రమణ వ్యాధుల ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వి.సుబ్బారావు, డాక్టర్ బాలకృష్ణ, నాగరాజు, కృష్ణమోహన్ పలు అంశాలపై మాట్లాడారు. ఈ–సంజీవని కోఆర్డినేటర్ వెంకట్, డెమో సాంబశివారెడ్డి, డీపీసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కొబ్బరి తోటల విస్తరణపై దృష్టి

- కొబ్బరి అభివృద్ధి బోర్డు డీడీ కుమార్‌వేల్



మాట్లాడుతున్న డీడీ కుమార్‌వేల్

అశ్వారావుపేటరూరల్: తెలంగాణలో కొబ్బరి సాగుకు అనుకూలంగా ఉండే ప్రాంతాల్లో తోటలను విస్తరించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కొబ్బరి అభివృద్ధి బోర్డు ఉమ్మడి ఏపీ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేల్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని గంగారం సమీపాన కొబ్బరి తోటలో శుక్రవారం సీడీబీ, ఉద్యాన శాఖ ఆధ్వర్యాన రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ.. రికార్డుల ప్రకారం ఏపీ కంటే తెలంగాణలో కొబ్బరి తోటల సాగు విస్తీర్ణం చాలా తక్కువగా ఉందని, దీంతో కొబ్బరి అభివృద్ధి మండలి బోర్డు ద్వారా రూ.51 లక్షలు కేటాయించి, రైతుల్లో ఆసక్తి పెంపొందిస్తున్నామని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం, ఉద్యాన శాఖ ఆధ్వర్యాన కొబ్బరి తోటలు సాగు చేసే రైతులకు ఎకరానికి 40 మొక్కల చొప్పున రాయితీపై రూ.36కు అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో రావు జోగేశ్వరరావు, మత్తే కిరణ్‌కుమార్, సందీప్‌కుమార్, జయకుమార్, ఐవీఎస్ రెడ్డి, లక్ష్మీరాజు, చిన్నంశెట్టి సత్యనారాయణ, ఆలపాటి రాము, కె.పుల్లయ్య, ప్రకాశ్‌రావు, తలశిల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పాప గుర్తింపు, అప్పగింత



రేష్మను అప్పగిస్తున్న దృశ్యం

ఖమ్మంక్రైం: ఆడుకుంటూ బయటకు వెళ్లిన పాపను గుర్తించిన దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ బాధ్యులు తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు... సత్తుపల్లికి చెందిన రఫీ, వహీదా తమ కుమారుడి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఖమ్మం ప్రభుత్వం శుక్రవారం ఆస్పత్రిలో చేర్పించారు. ఈసమయాన వీరి ఐదేళ్ల కుమార్తె రేష్మ ఆడుకుంటూ బయటకు వెళ్లి తప్పిపోయింది. దీంతో విషయం తెలుసుకున్న దిశ చైర్మన్ కావిటి రేవతి చైల్డ్ వెల్ఫేర్ సంస్థ బాధ్యులకు తెలిపి పాప కోసం గాలిస్తుండగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద ఉందని సిబ్బంది ఖమ్మం వన్ టౌన్ పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్సై వెంకటేష్, కానిస్టేబుల్ ఎం.రామకృష్ణ సాయంతో రేవతి, చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది శ్రీనివాసరావు, సంధ్య తదితరులు చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

నిమజ్జనానికి వెళ్లొచ్చే సరికి చోరీ

నేలకొండపల్లి: వినాయక విగ్రహం నిమజ్జనంలో పాల్గొని వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. మండలంలోని బుద్ధారానికి చెందిన పాశం బిక్షమారెడ్డి కుటుంబంతో సహా గురువారం సాయంత్రం వినాయక శోభాయాత్ర, నిమజ్జనానికి వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంటి ఆవరణలో దాచిన తాళం చెవి సాయంతో లనకు ప్రవేశించి బీరువా తాళం పగలగొట్టాక రూ.3లక్షల విలువైన రెండు బంగారు గొలుసులు, ఒక ఉంగరం, ఫోన్ సహా రూ.5 వేల అపహరించారు. రాత్రి ఇంటికి వచ్చాక చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు బియ్యం వేలం

ఖమ్మం సహకారనగర్: వివిధ కేసుల్లో జప్తు చేసిన 972.81 క్వింటాళ్ల బియ్యంను వేలం ద్వారా విక్రయించనున్నట్లుజిల్లా పౌర సరఫరాల శాఖాధికారి జి. శ్రీలత తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో శనివారం జరిగే వేలంలో డిస్టిలరీ, బేవరేజెస్ బాధ్యులు మాత్రమే రూ.50వేల డీడీ చెల్లించాలని పాల్గొనాలని సూచించారు. కాగా, బియ్యం కల్లూరులోని గోదాంలో భద్రపర్చినట్లు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

పేదలు నిశ్చింతగా జీవించేలా హక్కుపత్రాలు

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- లబ్ధిదారులకు జీఓ 58, 59 పట్టాలు, గృహలక్ష్మి మంజూరు పత్రాలు పంపిణీ



చింతగుర్తిలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి అజయ్, జెడ్పీటీసీ ప్రియాంక తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ స్థలాల్లో ఏళ్లుగా నివాసముంటున్న పేదలకు ఆ స్థలంలపై హక్కు కల్పించి నిశ్చింతగా జీవించేలా సీఎం కేసీఆర్ జీఓ 58 ద్వారా పట్టాలు మంజూరు చేస్తున్నారని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. అలాగే, ఇంటి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేని వారికి గృహలక్ష్మి ద్వారా ఆర్థికసాయం అందచేయనున్నట్లు చెప్పారు. కేఎంసీ పరిధిలోని పలు డివిజన్ల వాసులకు జీఓలు 58, 59 ద్వారా మంజూరైన పట్టాలతో పాటు గృహలక్ష్మి మంజూరు పత్రాలను మంత్రి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉంటుందన్నారు. ఈమేరకు ప్రజలు కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా, తనను మరోసారి గెలిపించాలని కోరారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడగా మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ, సుడా, మార్కెట్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, ఆర్డీఓ గణేశ్, తహసీల్దార్ స్వామి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అలాగే, 55వ డివిజన్ బైపాస్ రోడ్డులోని చౌదరి స్ట్రీట్‌లో కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కూడా మంత్రి మాట్లాడారు.

ఖమ్మంలో అభివృద్ధి పరుగులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మం మయూరిసెంటర్: అభివృద్ధి పనుల్లో కాక సంక్షేమ పథకాల అమలులో ఖమ్మం నియోజకవర్గంలో పరుగులు తీస్తోందని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మంలని 13, 33, 34, 35వ డివిజన్లలో పూర్తయిన పనులను ప్రారంభించిన మంత్రి, పలు పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ ఆదర్శసురభి, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, కార్పొరేటర్ నీరజ, పగడాల నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

రఘునాథపాలెం: రానున్న ఎన్నికల్లో ప్రలోభాలు పెట్టేందుకు వివిధ పార్టీల నాయకులు సిద్ధమవుతున్నారని.. కానీ ఎవరి మాటలు నమ్మకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగేలా బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తి నుండి సూర్యాతండా వెళ్లే రహదారిపై రూ.2.95 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు నూతనంగా నిర్మించనున్న పల్లె దవాఖానాను ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ మెంటేం రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ, మార్కెట్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, దోరేపల్లి శ్వేత, జెడ్పీటీసీ ప్రియాంక, ఎంపీపీ గౌరి, సర్పంచ్‌లు మాదంశెట్టి హరిప్రసాద్‌తో పాటు గుత్తా రవి, మద్దినేని వెంకటరమణ, ప్రదీప్, వీరు నాయక్, మందడపు సుధాకర్, కుర్రా భాస్కర్‌రావు, తాతా వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటాడేస్తా..!



ఫుట్‌బాల్ ఆడుతున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని 20 డివిజన్ రామచంద్రయ్యనగర్‌లో మున్సిపల్ స్పోర్ట్స్ పార్క్‌లో అధునాతన ఆస్ట్రో టర్ఫ్ ఫుట్‌బాల్ ఫీల్డ్ ఏర్పాటైంది. రూ.7లక్షల వ్యయంతో సిద్ధం చేసిన మైదానాన్ని రాష్ట్ర మంత్రి కేటీఆర్ శనివారం ప్రారంభించనున్న నేపథ్యాన రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ గౌతమ్, డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆదర్శ్‌కుమార్‌తో కలిసి పరిశీలించిన మంత్రి... సరదాగా ఫుట్‌బాల్ ఆడారు.

రూ.128 కోట్ల పనులకు శంకుస్థాపన

- హాజరుకానున్న మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, పువ్వాడ
- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: జిల్లా కేంద్రం తర్వాత సత్తుపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని.. ఎన్నికల కోసం కాకుండా ప్రణాళికాయుతంగా పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సత్తుపల్లి పట్టణాభివృద్ధికి రూ.వంద కోట్లు ఇవ్వగా, మరో రూ.128 కోట్ల విలువైన పనులకు శనివారం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. కొత్తూరు–రేజర్ల డైవర్షన్ రోడ్డు, షాదీఖానా, ఇండోర్ స్టేడియం, అంబేద్కర్ ఆడిటోరియం, మోడ్రన్ దోబీఘాట్, సత్తుపల్లి–ఎన్టీఆర్‌నగర్ వరకు నాలుగు లేన్ల రహదారి, సెంటర్ డివైడర్, లైటింగ్, రాజీవ్‌నగర్–కిన్లే ఫ్యాక్టరీ వరకు డివైడర్, క్రైస్తవ భవనం తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఉంటుందని చెప్పారు. అనంతరం పట్టణంలోని కాకర్లపల్లిరోడ్డులో సాయంత్రం 3 గంటలకు జరిగే బహిరంగ సభలో మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు పాల్గొంటారని ఎమ్మెల్యే సండ్ర తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, యాగంటి శ్రీను, ఎస్.కే.రఫీ, చల్లగుండ్ల కృష్ణయ్య, మల్లూరు అంకమ రాజు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి శనివారం మంత్రి కేటీఆర్ వస్తున్న నేపథ్యాన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్షించాక హెలీప్యాడ్, శంకుస్థాపన చేయనున్న ప్రాంతాల్లో ఏర్పాట్లపై ఆరా తీశారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, ఆర్‌అండ్‌బీ జేఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలను గెలుచుకుని కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. ఎర్రుపాలెం మండలంలోని తెల్లపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో శుక్రవారం జరిగిన బూత్‌స్థాయి సమీక్ష సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్ తుక్కుగూడ సభలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ శ్రేణులు ఎన్నికల వరకు నిరంతరం శ్రమిస్తూ ఓటర్లకు కాంగ్రెస్ పథకాలపై అవగాహన కల్పించాలని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తామనే విషయాన్ని వివరించాలని తెలిపారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈసమావేశంలో టీపీసీసీ సభ్యుడు శీలం ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితోపాటు కడియం శ్రీనివాసరావు, నందిగం సందీప్, కంచర్ల వెంకట నర్సయ్య, పిల్లి బోసు, శీలం శ్రీనివాసరెడ్డి, బండారు నర్సింహారావు, అనుమోలు కృష్ణారావు, దేవరకొండ రాజీవ్ గాంధీ, మల్లెల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక ఖమ్మం టౌన్ ఏసీపీ పరిధిలోకి..

- రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌ను మారుస్తూ ఉత్తర్వులు
- ఇన్‌స్పెక్టర్ స్థాయి హోదాతో పీఎస్ అప్‌గ్రేడ్

రఘునాథపాలెం: ఇప్పటివరకు ఖమ్మం రూరల్ ఏసీపీ పరిధిలో కొనసాగుతున్న రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌ను ఖమ్మం టౌన్ ఏసీపీ పరిధిలోకి బదలాయించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. రఘునాథపాలెం మండలం మొత్తం ఖమ్మం నియోజకవర్గ పరిధిలో ఉండగా, పోలీసు సర్కిల్, ఏసీపీ పరిధి మాత్రం పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం రూరల్ పరిధిలో కొనసాగుతోంది. దీంటో అటు ప్రజలకు, ఇటు పోలీసులకు సమస్యలు తలెత్తగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇటీవల పోలీసుస్టేషన్ భవనాన్ని ప్రారంభించేందుకు హోంమంత్రి మహమూద్ అలీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రఘునాథపాలెం పీఎస్‌ను ఖమ్మం టౌన్ ఏసీపీ పరిధిలోని బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ కాగా మంత్రులు కేటీఆర్, మహమూద్‌అలీకి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌హెచ్‌ఓగా ఇన్‌స్పెక్టర్

ఇప్పటి వరకు రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌కు ఎస్‌ఐ ఎస్‌హెచ్‌ఓగా కొనసాగుతున్నారు. తాజాగా ఖమ్మం టౌన్ ఏసీపీ పరిధిలోకి మార్చడమేకాక ఎస్‌హెచ్‌ఓగా ఇన్‌స్పెక్టర్‌ను నియమిస్తూ మార్పుచేశారు. ఈ నిర్ణయంతో ఇకనుంచి సీఐ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌ఓగా కొనసాగుతారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పత్తి చేనులో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రఘునాథపాలెం: మండలంలోని జీకే.బంజర తదితర గ్రామాల్లో శుక్రవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. శాస్త్రవేత్తలు డాక్టర్ రవికుమార్, డాక్టర్ చైతన్యతో పాటు ఖమ్మం ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ భాస్కర్‌రావు తదితరులు గ్రామాల్లో పర్యటించి పంటల రక్షణ, తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పూతదశలో ఉన్న మిరపలో కింద ముడ త, పొగాకు లద్దెపురుగు, బ్యాక్టీరియా, ఆకుమచ్చ తెగులు, జెమిని వైరస్ సోకినట్లు గుర్తించి వాడాల్సిన మందులను వివరించారు.

డెంగీతో బాలుడు మృతి



అజయ్ (ఫైల్)

వైరా: డెంగీ జ్వరంతో బాధపడుతున్న బాలుడు మృతి చెందాడు. వైరా గుట్ట బడిలో ఐదో తరగతి చదువుతున్న చెక్కు అజయ్(9) నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడుతుండగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి ఖమ్మం తీసుకెళ్లారు. కానీ పరిస్థితి విషమించడంతో ఖమ్మం నుంచి విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తండ్రి మురళి వైరా రిజర్వాయర్‌లో చేపల వేట ఆధారంగా జీవనం సాగిస్తుండగా, ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దుఃఖానికి అంతు లేకుండా పోయింది.

ఇంజనీర్ కుటుంబానికి రూ.1.75 కోట్ల పరిహారం

- ఖమ్మం లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారం



ఇంజనీర్ కుటుంబానికి అవార్డు కాపీ అందజేస్తున్న జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్

ఖమ్మంలీగల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళా ఉద్యోగి కుటుంబానికి ఖమ్మం లోక్ అదాలత్ ద్వారా రూ.1.75 కోట్ల పరిహారం ఇప్పించారు. వైరా మండలం సిరిపురానికి చెందిన అభినందన స్రవంతి విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, 2019 జూన్ 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా రెండు నెలల చికిత్స అనంతరం మరణించింది. చికిత్స కోసం కుటుంబం రూ.10 లక్షలు వెచ్చించినా ఫలితం లేకపోవడంతో నష్టపరిహారం నిమిత్తం న్యాయవాది మందడపు శ్రీనివాసరావు ద్వారా రూ.3కోట్లు పరిహారం చెల్లించాలని రాయల్ సుందరం బీమా సంస్థపై జిల్లా కోర్టులో దావా దాఖలు చేశారు. బీమా సంస్థ న్యాయవాది బండారుపల్లి గంగాధర్ వాదనలను వినిపించగా... బాధిత కుటుంబం పరిస్థితిని గమనించిన జిల్లా న్యాయమూర్తి బీఎస్.జగ్జీవన్ కుమార్ సూచనతో ఇరుపక్షాలు లోక్ అదాలత్‌లో రాజీ పడాలని నిర్ణయించారు. మృతురాలు నెలకు రూ.1.29 లక్షలు సంపాదిస్తుండడం, ఇంకా చాలా ఏళ్ల సర్వీస్ ఉండడాన్ని పరిగణనలోకి తీసుకుని బీమా కంపెనీ రూ.1.75 కోట్ల పరిహారం ఇచ్చేందుకు అంగీకరించింది. ఈమేరకు శుక్రవారం ఖమ్మం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి డి రాంప్రసాదరావు లోక్ అదాలత్ అవార్డు జారీ చేయగా, కాపీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్ కుమార్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, ఎన్.అమరావతి, మహమ్మద్ అబ్దుల్ జావీద్ పాషా, న్యాయవాదులు మందడపు శ్రీనివాసరావు, బండారుపల్లి గంగాధర్, బీమా కంపెనీ అధికారి సంజయ్ పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ సర్కారే..

- పార్టీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



సత్తుపల్లిలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి, పక్కన నాయకులు

వైరా/సత్తుపల్లి టౌన్/ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే ఎన్నికల్లో తెలంగాణ విజయం సాధించి అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని ఆ పార్టీ తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం నుంచి గాంధీ జయంతి వరకు నిర్వహించే సేవా పక్వాడా బూత్ స్వశక్తీకరణ్ కార్యక్రమాల్లో భాగంగా వైరా, సత్తుపల్లిలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించి మాట్లాడిన ఆయన ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ బూటకపు మాటలను ప్రజలు మరోమారు నమ్మి మోసపోకుండా, మోదీ నాయకత్వాన్ని బలపర్చి బీజేపీని గెలిపించాలన్నారు. అన్నివర్గాలను మోసం చేసిన కేసీఆర్ ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో పడిపోయి, బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాగా, కాంగ్రెస్ బద్ధశత్రువవని చెప్పిన ఓ నాయకుడు... ఇప్పుడు అదే పార్టీలో చేరారని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలవి ఓటుబ్యాంకు రాజకీయాలని.. కానీ బీజేపీ మాత్రం ప్రజలందరి అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తుందని పొంగులేటి చెప్పారు. ఈకార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఇన్‌చార్జ్ త్రిలోకేశ్వర్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నంబూరి రామలింగేశ్వరరావుతో పాటు నాయకులు నెల్లూరి కోటేశ్వరరావు, సున్నా రవికుమార్, శ్యాంనాయక్, బీ.పీ.నాయక్, కృష్ణరాథోడ్, భద్రయ్య, నాగేశ్వరరావు, గోపాలకృష్ణ, నరేష్, రామారావు, రమేష్, ఉప్పల శారద, డి.సత్యనారాయణ, కూసంపూడి రవీంద్ర, బి.వీరంరాజు, సుధాకర్, సుదర్శన్, మధుసూదన్, పుల్లయ్య యాదవ్, అల్లిక అంజయ్య, శంకర్‌గౌడ్, తాళ్లూరి సురేష్ పాల్గొన్నారు.

అతివేగానికి నిండు ప్రాణాలు బలి

- కారు డివైడర్‌ను ఢీకొనడంతో భార్యాభర్తలు మృతి
- నలుగురు చిన్నారులకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు (ఇన్‌సెట్) సంతోష్‌కుమార్ (ఫైల్)

ఖమ్మంరూరల్: బతుకుదెరువు కోసం ఊరుకాని ఊరు వచ్చిన కుటుంబం.. స్వగ్రామంలో సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తున్నారు... ఈక్రమంలో అతివేగం కారణంగా కారు బోల్తా పడడంతో దంపతులు మృతి చెందారు. ఇదే ఘటనలో మరో నలుగురు చిన్నారులు గాయపడగా వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మునగాల మండలం తాడ్వాయి శివారు ఎస్‌ఎం.పేటకు చెందిన సంతోష్‌కుమార్ బతుకుదెరువు కోసం ఏడాది క్రితం కుటుంబంతో సహా ఖమ్మం వచ్చి మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. కాగా, సంతోష్‌కుమార్ పెదనాన్న మృతి చెందగా అంత్యక్రియల కోసం స్వగ్రామానికి కారులో వెళ్లారు. ఆతర్వాత రెండు కార్లలో తిరిగి ఖమ్మం వస్తున్నారు. ఒక కారులో సంతోష్‌కుమార్ – ఝాన్సీరాణి దంపతులు, వారి ఇద్దరు పిల్లలతో పాటు సోదరుడి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద కారు అతివేగంగా వస్తుండడంతో అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జు కాగా డ్రైవింగ్ చేస్తున్న సంతోష్‌కుమార్ అందులోనే చిక్కుకుని మృతి చెందాడు. ఆయన భార్య ఝాన్సీరాణికి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కారులో ఉన్న నలుగురు పిల్లలకు తీవ్ర గాయాలు కాగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. ఇదిలాఉండగా అదే సమయాన ఖమ్మం రూరల్ మండలం నుంచి కూసుమంచి వైపు వెళ్తున్న పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించేలా ఏర్పాట్లు చేశారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

నవోదయ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసులు



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌గా కె.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ నవోదయలో వైస్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు పదోన్నతి కల్పించి పాలేరుకు కేటాయించారు. పాలేరు నవోదయలో విద్యార్థి దుర్గానాగేందర్ జూలై 29న విద్యుదాఘాతంతో మృతి చెందగా అప్పటి ప్రిన్సిపాల్ చంద్రబాబును సస్పెండ్ చేసి, నల్లగొండ ప్రిన్సిపాల్ నాగభూషణంను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఇప్పుడు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసులును నియమించారు. అలాగే, వైస్ ప్రిన్సిపాల్‌గా గుంటూరు నవోదయలో పనిచేస్తున్న పి.శ్రీనివాసరావును కేటాయించగా ఆయన కూడా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యులు కలిసి సన్మానించారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

నేలకొండపల్లి: జిల్లా మీదుగా గంజాయి రవాణా జరగకుండా, జిల్లాలో అమ్మకాలను అడ్డుకునేలా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వి.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నేలకొండపల్లి సర్కిల్ కార్యాలయానికి శుక్రవారం వచ్చిన ఆయన వైన్స్ యాజమానులతో సమావేశమయ్యారు. ఆతర్వాత నేలకొండపల్లి, రాజేశ్వరపురంల్లో వైన్స్‌ను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి విక్రయాలపై అణచివేసేందుకు పోలీస్, ఎక్సైజ్ శాఖల సమన్వయంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే, అందరి సహకారంతో గుడుంబా రహిత జిల్లాగా నిలిపినట్లు చెప్పారు. కకాగా, జిల్లాలోని పలు వైన్స్ నుంచి బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, ఇకనైనా యజమానులు తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి సీఐ కె.పోశెట్టి, టాస్క్‌ఫోర్స్ సీఐ విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పలుచోట్ల వానలు

– సాగులో ఉన్న పైర్లకు ప్రయోజనం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షపాతం నమోదైంది. గురువారం రాత్రి నుంచి శుకవారం తెల్లవారుజాము వరకు వాన ప్రభావం ఉంది. జిల్లా సగటు వర్షపాతం 10.1మి.మీగా నమోదు కాగా, అత్యధికంగా ఏన్కూరులో 70.8 మి.మీల. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఇక తల్లాడ, ఖమ్మం అర్బన్, కల్లూరు, ఖమ్మం రూరల్, కామేపల్లి, సింగరేణి, వైరా మండలాల్లో కూడా వర్షప్రభావం కనిపించింది. కాగా, ప్రస్తుతం కురుస్తున్న వానలు సాగులో ఉన్న పైర్లకు ప్రయోజనంగా మారాయి. జిల్లాలోని 1.83 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పత్తి పూత, కాత దశలో ఉండగా, ఇంకొన్ని చోట్ల కాత పక్వానికి వస్తోంది. అయితే, కొన్నాళ్లుగా వానలు లేక పత్తి బెట్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యాన ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో దిగుబడి పెరిగే అవకాశముందని రైతులు ఆశిస్తున్నారు. ఇక వరి తెగుళ్ల నుంచి రక్షణ కలగనుండగా, మొక్కజొన్న కండె, గింజకు ప్రయోజనంగా ఉంటుందని చెబుతున్నారు.